క్లుప్తంగా

రవికుమార్‌కు భూమన నివాళి


నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: పాండ్రవేటి రవికుమార్ భౌతికకాయానికి టీటీడీ మాజీ చైర్మన్, చిత్తూరు, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి గజమాలలతో నివాళులర్పించారు. మంగళవారం పెద్దకాపు లేఔట్‌లోని పాండ్రవేటి నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అత్యంత ఆప్తులు, ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఆప్యాయంగా పలకరించే రవికుమార్ భౌతికంగా దూరం కావడం బాధాకరమని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పశు వైద్య శిబిరాలకు స్పందన


కొండ్రెడ్డికండ్రిగలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరం

చంద్రగిరి: మండలంలోని కొండ్రెడ్డి కండ్రిగ, ఎగువ కూచువారిపల్లెలో మంగళవారం నారావారిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ వంశీ తన సిబ్బందితో కలసి పశువైద్య శిబిరాలు నిర్వహించారు. 51 మంది పాడి రైతులు హైబ్రీడ్, నాటు ఆవులు, దూడలు, మేకలు, గొర్రెలను తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి, వ్యాక్సినేషన్ చేశారు. వాటి ఎదుగుదలకు కావాల్సిన మందులను అందజేశారు. అలాగే నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పిడుదుల నివారణకుగాను జీవాలకు బుటాక్స్ మందును పిచికారీ చేశారు. మండల వ్యాప్తంగా పది రోజుల పాటు మూడు బృందాలుగా ఈ శిబిరాలను నిర్వహిస్తామని, పాడి రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వంశీ కోరారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

బహుజనుల్లో చైతన్యం తెద్దాం


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: రాజ్యాంగంపై బహుజనుల్లో చైతన్యం తెచ్చి, రాజ్యాంగం వైపు ఆలోచింపజేస్తూ తద్వారా ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య ,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య పిలుపు నిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగ పీఠిక, రాజ్యాంగ పరిరక్షణ వేదిక క్యాలెండర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తికి భిన్నంగా పాలకులు దుర్మార్గపు ఆలోచనలతో దళితులు, ఆదివాసులను చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు సాధించాలని లేనిపక్షంలో దళిత, ఆదివాసుల బతుకులు దుర్భరం కాక తప్పదన్నారు. ఈ నేపథ్యంలో దళిత మేధావులందరూ ప్రజలను సంఘటితం చేసి రాజ్యాంగ హక్కుల సాధనకు ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, శ్రీనివాసులు, పట్టాభి పాల్గొన్నారు.

ఘనంగా పరుష పందాలు


ఎద్దులను తీసుకెళుతున్న యువకులు

పాకాల: మండలంలోని గాదంకిలో మంగళవారం పరుష పందాలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఎద్దులను శుభ్రంగా కడిగి, వాటి కొమ్ములకు రంగులు అద్ది, సుందరంగా అలంకరించారు. స్థానిక గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి ఊరేగించారు. తమ అభిమాన హీరోలు, రాజకీయ నాయకుల చిత్రాలతో ఎద్దుల కొమ్ములకు పలకలు కట్టారు. ఆపై ఎద్దులను తరిమారు. యువత ఎద్దుల నిలువరించి ఆ పలకలను దక్కించుకునేందుకు నువ్వా, నేనా? అని పోటీ పడ్డారు. ప్రజలు పరుష పందాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలి వచ్చారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు


ఆకాష్ పూరి, సంయుక్త మీనన్, మంగ్లీ

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటులు ఆకాష్ పూరి, సంయుక్త మీనన్, గాయని మంగ్లీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

వాహనాల ‘బ్లాక్’ మ్యాజిక్..!



- ముదురుతున్న అద్దాల రంగు
- లోపలి భాగం స్పష్టంగా కనిపించకుండా ఏర్పాటు
- సుప్రీంకోర్టు ఆదేశాలకు తిలోదకాలు
- సామాన్యులతో పాటు ప్రజాప్రతినిధులదీ అదే తీరు..!
- పట్టించుకోని రవాణా, పోలీస్ అధికారులు

కార్లు, ఇతర వాహనాల అద్దాలపై రంగు ఫిల్మ్‌లు ఉండకూడదు. ఆయా వాహనాల్లోని లోపలి భాగం స్పష్టంగా బయటికి కనిపించేలా ఉండాలి. అవాంఛనీయ ఘటనలకు తావివ్వరాదనే ఉద్దేశంతో సుప్రీం కోర్టు గతంలో న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలివి. వీటి అమలు నగరంలో క్రమక్రమంగా మసకబారుతోంది. పలు వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేసుకుని రోడ్లపై చక్కర్లు కొడుతున్నాఅటు రవాణా, ఇటు పోలీస్‌శాఖలు పట్టించుకోవడం లేదు.

తిరుపతి మంగళం : వాహనాల్లో మూలాన నేరాలు, ప్రమాదాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం 2012లో కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని అమలు చేయాల్సిన బాధ్యతను రాష్ట్రాల డీజీపీలు, కమిషనరేట్ల కమిషనర్ల ద్వారా ఆయా ట్రాఫిక్ విభాగాలకు అప్పగించింది. న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం.. వాహనాల ముందు వెనుక అద్దాలు 70శాతం, పక్క డోర్ అద్దాలు 50శాతం కాంతి ప్రసారకాలుగా(విజువల్ లైట్ ట్రాన్స్‌మిషన్) ఉండాల్సిందే. ప్రస్తుతం అనేక వాహనాలకు ఇది కేవలం 30, 10 శాతంగానే ఉంటోంది. ఫిల్మ్‌తో పాటు ఇతర ఏ విధమైన అద్దాలపై నిర్ణీత ప్రమాణాలకు మించి ఉండకూడదు. కార్లను తయారు చేసే కంపెనీలు కచ్చితమైన ప్రమాణాలతో అద్దాలను రూపొందిస్తున్నప్పటికీ ఆ అద్దాలపై ఫిల్మ్‌లు వేసుకుని వాహన యజమానులు దర్జాగా తిరుగుతున్నారు.

ఆ రెండు కేటగిరీలకే మినహాయింపు

బ్లాక్ ఫిల్మ్‌తో కూడిన అద్దాల వాహనాలు వినియోగిస్తున్న వారిలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం ఉంటున్నారు. సెలబ్రిటీలు కూడా తమకు పబ్లిక్ ప్లేసుల్లో అభిమానులతో అనవసర ఇబ్బందులు వస్తాయనే సాకుతో వినియోగిస్తున్నారు. ప్రజాప్రతినిధులైతే ఏకంగా భద్రతా కారణాలు చెబుతున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బ్లాక్ ఫిల్మ్ నింబంధన నుంచి కేవలం జెడ్, జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉండే అత్యంత ప్రముఖులకు మాత్రమే మినహాయింపు ఉంది. అదీ కేవలం అధీకృత వాహనాలు, భద్రతాపరమైన అంశాల్లో మాత్రమే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అత్యున్నత అధికారుల వాహనాలకు సైతం ఫిల్మ్ లేని అద్దాలతో కూడిన వాహనాలనే వినియోగించాల్సి ఉంది.


నగరంలో బ్లాక్ ఫిల్మ్ వేసుకుని తిరుగుతున్న వాహనాలు

మినహాయింపు పొందటం ప్రహసనమే

ఓ ప్రముఖుడు లేదా వ్యక్తికి భభద్రత కల్పించాలన్నా, గన్‌మెన్లను ఏర్పాటు చేయాలన్నా దానికి సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్సార్సీ)సిఫార్సులు తప్పనిసరి. అలాగే ఈ బ్లాక్ ఫిల్మ్ నిబంధన నుంచి జెడ్, జెడ్ ప్లస్ కేటగిరీల్లో ఉన్న వారు కాకుండా ఇతరులు మినహాయింపు పొందాలంటే దానికి తంతు ఉంది. రాష్ట్ర స్థాయిలో హోం సెక్రటరీ నేతృత్వంలో డీజీపీ తదితరులతో ఏర్పాటయ్యే అత్యున్నత స్థాయి ప్రత్యేక కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఈ కమిటీ దరఖాస్తుదారుడి పూర్వాపరాలను పరిశీలించి, వివిధ కోణాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీ కేవలం భద్రతాపరమైన అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని మినహాయింపులు ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

తిరుపతిలో కలర్ అద్దాల వాహనాలు ఎక్కువ

తిరుపతికి ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం లక్షలాది మంది భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలు వస్తుంటారు. తిరుపతికి వచ్చే వాహనాల్లో అధిక శాతం బ్లాక్ ఫిల్మ్‌తో ఉన్న వాహనాలే కనిపిస్తున్నాయి. వాటిలో ఎవరు వస్తున్నారో, ఎవరు వెళుతున్నారో? రోడ్డుపై వెళుతున్న వారికి కూడా తెలియని పరిస్థితి ఉంది. ఎవరినైనా కిడ్నాప్ చేసి తీసుకెళ్తున్నా, మాదకద్రవ్యాలు, మారణాయుధాలు తీసుకొస్తున్నా కనిపించని పరిస్థితి. ఎవరు వీఐపీలో, ఎవరు సామాన్యులో తెలుసుకోలేనంతగా వారి వాహనాలకు బ్లాక్ ఫిల్మ్ వేసుకుని, సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా తిరుగుతున్నారు. ‘బ్లాక్’తో కళ్లు కప్పి మ్యాజిక్ చేస్తున్న ఈ వాహనాలను భరతం పట్టేవారెవరో!

ఎస్వీయూ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్


వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తిరుపతి సిటీ: అధికార పార్టీ ఏజెంటులా వ్యవహరిస్తున్న ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్ చిత్రాలను ఫ్లెక్సీలలో ముద్రించే విద్యార్థి సంఘాలకు మాత్రమే పెద్దపీట వేస్తూ ఏకపక్ష ధోరణితో రిజిస్ట్రార్ వ్యవహరించడం తగదన్నారు. విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేస్తూ, వర్సిటీ సమస్యలపై గళమెత్తుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలకు వర్సిటీలో మహాసభల నిర్వహణకు అనుమతి నిరాకరించడం ఎంతవరకూ సబబని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను, ఇతర వర్సిటీ పనులను తన సామాజిక వర్గానికి కట్టబెడుతూ వర్సిటీ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. హాస్టల్ మెస్‌ల టెండర్లు తమ అనుచరులకు అంటగట్టడం, వర్సిటీతో సంబంధం లేని వ్యక్తులను తన చాంబర్‌లో కూర్చోబెట్టుకుని రాజకీయాలను చర్చిస్తూ అటు ఉద్యోగులను, ఇటు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీపై అంత అభిమానం, ప్రేమ ఉంటే వెంటనే పదవికి రాజీనామా చేసి పార్టీ కండువా కప్పుకోవాలని, తీరు మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి ఆఫీస్ బేరర్లు అశోక్ కుమార్, వినోద్, బాల, తేజ పాల్గొన్నారు.

గౌరిపెద్ది పాండిత్యం యువతకు స్ఫూర్తిదాయకం


గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పలువురు సాహితీవేత్తలు, ఇతర అధికారులు

– ప్రముఖ శతావధాని భరత్ శర్మ

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అమూల్యమైన సేవలందించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మ జీవితం, ఆయన అన్నమాచార్య కీర్తనలపై చేసిన కృషి యువతకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ శతావధాని భరత్ శర్మ అన్నారు. గౌరిపెద్ది రామసుబ్బ శర్మ 34వ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు నిర్వహించారు. తిరుపతికి చెందిన శతావధాని భరత్ శర్మ ‘సాహితీ శిఖరం–గౌరిపెద్ది’ అనే అంశంపై ప్రసంగించారు. శ్రీవారికి పరమ భక్తుడైన అన్నమాచార్యులు గానం చేసిన పద కవితలు, సంకీర్తనలను రామసుబ్బశర్మ విశ్లేషించారన్నారు. ప్రముఖ శతావధాని ఆముదాల మురళి ‘గౌరిపెద్ది–అన్నమయ్య కీర్తనల పరిష్కరణ’ అంశంపై మాట్లాడుతూ, అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖులలో గౌరిపెద్ది ఒకరని, తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలు 27 సంపుటాలు పరిష్కరించడంలో గౌరి పెద్ది విశేష కృషి చేశారని కీర్తించారు. భారత, భాగవత, పురాణ ఇతిహాసాలను అపూర్వ సాహిత్యంతో అందించిన సంకీర్తనలను గౌరిపెద్ది రామ సుబ్బ శర్మ మనకు అందించారని వివరించారు. తొలుత ఎస్వీ ప్రాచ్య కళాశాల ఆవరణలోని గౌరిపెద్ది రామసుబ్బ శర్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు, గౌరిపెద్ది వెంకట భగవాన్, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

భాకరాపేట : సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యమని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల వ్యవసాయాధికారులు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం భాకరాపేట, ఎర్రావారిపాళెంలో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేశారు. వరి, మామిడిలో సమగ్ర పోషణ, యాజమాన్య పద్ధతులు, పంటల బీమా ప్రయోజనం, బీమా పొందడం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది మునిశేఖర్, భానుప్రకాష్, రాజశేఖర్, తేజస్విని, జాహ్నవి, నళినీదేవి, రైతులు పాల్గొన్నారు.

కృత్యాధార బోధన ఉపయుక్తం


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న శివశంకరయ్య

రామచంద్రాపురం: విద్యార్థులకు కృత్యాధార పద్ధతులతో బోధించడం ఉపయుక్తమని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని సిద్దేశ్వర ఎస్టీకాలనీ, పీవీపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మార్కొండయ్య, టరల్ కో–ఆర్డినేటర్ పాల్గొన్నారు.

వేస్ట్ పికర్స్‌కు త్రిచక్ర వాహనాలు, తోపుడు బండ్లు


వేస్ట్ పికర్స్‌కు తోపుడు బండ్లు, త్రిచక్రవాహనాలు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఎలాంటి గుర్తింపు, ఆదరణకు నోచుకోక కాగితాలు ఏరుకునే(వేస్ట్ పికర్స్)కు దళిత బహుజన్ రీసెర్చ్ సెంటర్, టెట్రా ప్యాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా త్రిచక్ర వాహనాలు, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. మంగళవారం యూత్ హాస్టల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెప్మా టీఎంఎం మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా 16 మంది వేస్ట్ పికర్స్ 11 మూడు చక్రాల వాహనాలు, 5 తోపుడు బండ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, బతుకు దెరువు కోసం వీటిని ఇచ్చి చేయూతనివ్వడంఅభినందనీయమన్నారు. దళిత బహుజన్ రీసెర్చ్ సెంటర్ డెప్యూటీ డైరెక్టర్ చుక్కా అనిల్‌కుమార్ మాట్లాడుతూ, 1992లో సంస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలో 8 జిల్లాల్లో ప్రభుత్వం పథకాల ఫలాలకు నోచుకోని వేస్ట్ పికర్స్‌ను గుర్తించి వారి జీవితంలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా కో–ఆర్డినేటర్ సురేష్, ఉదయ్‌కుమార్, తేజశ్రీ, మెప్మా సిబ్బంది బి.మహేష్, జి. శ్రీరాములు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ఆగ్రహం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని ఎస్టీవీ నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఉదయం ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ ఎన్. మౌర్య పరిశీలించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు కార్పొరేటర్ ఆంజనేయులుతో కలసి ప్రధాన దారులతో పాటు, సందుల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మురుగు కాలువలు పాడై , చెత్త నిల్వ ఉండడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. చిన్నచిన్న వీధుల్లో కూడా మురుగు కాలువలు, రోడ్లు శుభ్రంగా ఉంచాలని, కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల వద్దకు వచ్చే తమ పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ లలిత, డీసీపీ మహాపాత్ర, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వార్ దాస్‌కు వాకర్స్ నివాళి


ఆళ్వార్ దాస్‌కు నివాళులు అర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


లెనిన్‌కు నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర ఆళ్వార్ దాస్‌కు వాకర్స్ పుష్పాంజలి ఘటించారు. ఆళ్వార్ దాస్ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం కరకంబాడి రోడ్డులోని వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆళ్వార్ దాస్ సేవలను వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ప్రస్తుతించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామస్వామి, సాయికృష్ణంరాజు, సుబ్రమణ్యం రాజు, నరసింహయ్య, శాంతి, చంద్ర, యోగా మాస్టర్ వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

లెనిన్‌కు సీపీఐ నేతలు..

తిరుపతి కల్చరల్: కామ్రేడ్ లెనిన్ 101వ వర్ధంతి పురస్కరించుకొని సీపీఐ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ, లెనిన్ ఓ జ్ఞాపకం కాదని వర్తమానమని అన్నారు. ఆయన సైద్ధాంతిక కృషి, విప్లవ కార్యాచరణ అధ్యయనాన్ని ప్రతి కమ్యూనిస్టు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాల మూలాన దేశంలో కార్మికులు, పేద ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి పోరాట కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు బండి చలపతి, రామచంద్రయ్య, శ్రీరాములు, శివ, గోవిందస్వామి, రామకృష్ణ, నాగరాజు, బాషా, మురళి, పురుషోత్తంరెడ్డి, హరి పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలో ఎస్వీ జేసీ విద్యార్థి ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తిరుపతి స్వామి వివేకానంద మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహించింది. వక్తృత్వ విభాగంలో ‘స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం’ అనే అంశంపై ఎస్వీ జూనియర్ కళాశాల సీనియర్ ఎంఈసీ విద్యార్థి పి.ధనుష్‌చంద్ర అంగ్లంలో అనర్గళంగా మాట్లాడి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థికి రూ.2,500తోపాటు రూ.2.500విలువైన పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, పౌర శాస్త్ర అధ్యాపకుడు వై.మహేశ్వరయ్య, ఇతర అధ్యాపకులు అభినందించారు.

దోపిడీ వర్గాలపై పోరాటంతోనే విముక్తి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత రమాదేవి

తిరుపతి కల్చరల్: దేశంలో కార్మిక వర్గం , రైతాంగం, ఇతర శ్రామిక జనం ఏకమై పెట్టుబడిదారీ విధానాన్ని ఎదిరించి పోరాడితేనే విముక్తి సాధ్యమని, ఆ దిశగా ముందడుగు వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి ముగింపు సందర్భంగా మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ‘పెట్టుబడి ప్రజాస్వామ్యం’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరింత నియంతృత్వంగా ప్రజల హక్కులపై దాడి చేస్తోందన్నారు. కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తూ ప్రజానీకాన్ని అన్ని విధాలా దోపిడీ చేస్తోందని విమర్శించారు. పాలకులు రాజ్యాంగబద్ధంగా ఉన్న ప్రజాస్వామ్య హక్కును కాలరాస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో లెనిన్‌ను ఆదర్శంగా తీసుకొని ఎన్ని కష్టాలు వచ్చినా దోపిడీ వర్గాలపై పోరాటంతో విజయం సాధించాలని ఆమె వామపక్ష శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, పుల్లయ్య, జనార్ధన్, టి.సుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, మాధవ కృష్ణ, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆటోల దందా..!


తిరుపతి బస్టాండ్ వద్ద ఎంచక్కా ఆటోలను పెట్టేసిన వైనం

తిరుపతి అర్బన్: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతో మర్యాద మసలుకోండి..తిరుపతికి మంచి పేరు తెచ్చేలా వ్యవహరించండని, అటు పోలీస్, ఇటు ఆర్టీసీ అధికారులు ఆటోడ్రైవర్లకు అడపాదడపా హితబోధ చేస్తున్నా ఇవేవీ కొందరు పట్టించుకోవడం లేదు. శ్రీవారి దర్శనార్థం వచ్చారని వారి చూడగానే గ్రహించి వారి జేబులకు లూటీ చేసేందుకు నిమగ్నమైపోతున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో కొందరు ఆటోడ్రైవర్ల తీరుతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌కు సంబంధించి ఇన్..అవుట్ వద్ద వాహనాలకు, ప్రయాణికులకు అడ్డదిడ్డంగా ఆటోలను పెట్టేస్తున్నారు. దీంతో ఓ వైపు ఆర్టీసీ సర్వీసులు లోనికి వెళ్లాలన్నా...తిరిగి బయటకు రావాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిమూలాన ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. మరోవైపు ప్రయాణికుల పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదు. రాత్రి సమయంలో అయితే ఏకంగా బస్టాండ్‌లోనికి వెళ్లి ఆటోవాలాలు ప్రయాణికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఆటో చార్జీ ఎక్కువ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆవేదన చెందుతున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులతో వీరి తీరు మూలాన తిరుపతికే అప్రతిష్ట మకిలి అంటుతోంది. సంబంధిత అధికారులు ఇకనైనా ఆటోల దందాలకు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి తోడ్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్: పార్టీలకతీతంగా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్టు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. పలువురు సర్పంచులు, కార్యదర్శులు తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, రూరల్ మండలంలో ఇప్పటికే ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.3.99 కోట్లతో 45 పనులు చేపట్టామని, వీటితో పాటు మండల పరిషత్ నిధులు రూ.1.43 కోట్లతో 27 పనులు కొత్తగా మంజూరు చేశామన్నారు. ఇంకా ఎక్కడైనా రోడ్లు, మురుగు కాలువల అవసరం ఉన్నపక్షంలో అంచనాలు రూపొందించాలని పీఆర్ డీఈ మురళిని ఆదేశించారు.

అధికారుల సమీక్షలో టీడీపీ నేతలు!

అధికారులు, సర్పంచులతో ఎమ్మెల్యే నిర్వహించిన సమీక్షలో ఎలాంటి హోదా లేని కొందరు టీడీపీ నేతలు పాల్గొనడంపై విమర్శలకు తావిచ్చింది. సమావేశంలో కూర్చోవడమే కాకుండా, కొందరు మైక్ తీసుకుని మాట్లాడేందుకు సైతం ప్రయత్నించినా ఎంపీడీఓ రామచంద్ర వారిని అడ్డుకోకపోవడంపై సర్పంచులు తప్పు పట్టారు. ఇది గుర్తించిన ఎమ్మెల్యే నాని అనధికార వ్యక్తులు ఇక్కడ మాట్లాడేందుకు అవకాశం లేదని, వారికి మైక్ ఇవ్వవద్దన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.